నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | మార్చి 09, 2024 | www.navatelangana.com

గ్రామస్తులను సన్మానించిన జడ్పీటీసీ

నవతెలంగాణ-తలమడుగు

ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జూనియర్, సీనియర్ లెక్చరర్ రెండు ఉద్యోగాలు సాధించిన రుయ్యాడి గ్రామానికి చెందిన ఎ.శ్రీనివాస్‌ను, అదే విధంగా పదవి విరమణ చేసిన బొజ్జ మోహన్‌ను శుక్రవారం జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డితో పాటు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ బిట్ల పెద్ద గంగన్న, మాజీ సర్పంచ్ పుండ్రు పోతారెడ్డి, కాంతారావు, గోనెల గంగన్న, ఎల్చాల మురళీ, అయ్యన్న, సంజీవ్‌రెడ్డి, ఇస్తారి, సొసైటీ సీఈఓ మోతె శ్రీనివాస్, సాంబశివ్, ప్రవీణ్‌రెడ్డి, బిట్ల చైతన్య, అశోక్, వెంకటేష్, బాలాజీ, దివాకర్, గ్రామ యువకులు పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

నవతెలంగాణ-ఖానాపూర్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే బొజ్జు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో పనిచేస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేఖ నాయక్, మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దయానంద్, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, కాంగ్రెస్ మండల జనరల్ సెక్రెటరీ షబ్బీర్ పాషా, పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, సీనియర్ నాయకులు అమనుల్లాఖాన్, కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షులు సలీంఖాన్, మైనార్టీ పట్టణ అధ్యక్షులు షౌకత్ పాషా పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌పైనే అందరి దృష్టి..!

- ఎంపీ సీటు కైవసం కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు
- సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని చూస్తున్న బీజేపీ
- విజయం సాధించి సత్తాచాటాలని భావిస్తున్న బీఆర్ఎస్
- లోక్‌సభ స్థానంపై ప్రధాన పార్టీల ఎత్తుగడలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ సీటు హాట్‌టాపిక్‌గా మారుతోంది. అన్ని పార్టీల దృష్టి ఈ స్థానంపైనే కేంద్రీకృతమవుతోంది. పెద్ద ఎత్తున సభలు నిర్వహించి ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎంపీ సీటును కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తుండగా.. సిట్టింగ్ స్థానాన్ని మరోసారి నిలబెట్టుకోవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. మరోపక్క అసెంబ్లీ ఎన్నికల్లో అధిక ఓట్లు సాధించామనే ధీమాతో బీఆర్ఎస్ సైతం ఈ స్థానంలో సత్తాచాటాలని భావిస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది. ఇలా మూడు ప్రధాన పార్టీలు ఎవరికి వారు ఈ సీటుపై కన్నేయడంతో ఉమ్మడి జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఇప్పటికే కాంగ్రెస్,బీజేపీ నుంచి టికెట్లు దక్కించుకునేందుకు అనేక మంది ఆశావహులు పోటీ పడుతుండగా.. బీఆర్ఎస్‌లో మాత్రం ప్రస్తుతం అంతగా పోటీ వాతావరణం కనిపించడం లేదు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు జిల్లాలో సభలు నిర్వహించి లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించగా.. నోటిఫికేషన్ రాగానే బీఆర్ఎస్ సైతం త్వరలో సభ నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా మూడు పార్టీలు ఎవరికివారు లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకోవాలని భావిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

రానున్న లోక్‌సభ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఎంపీ సీటును గెలుచుకోవడమే ప్రధాన ఏజెండాగా భావిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో రాజకీయ మార్పులు చోటుచేసుకోగా.. లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని భావిస్తోంది. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో చివరిసారి ఎంపీ స్థానంలో విజయం సాధించిన కాంగ్రెస్ అనంతరం జరిగిన ఎన్నికల్లో ఒక్కసారి కూడా గెలువలేదు. తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఈ సారి కచ్చితంగా ఈ స్థానంలో విజయం సాధించాలని పార్టీ భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల శంఖారావాన్ని జిల్లా నుంచే ప్రారంభించిన ఆ పార్టీ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకుంది. అదే సెంటిమెంట్‌ను పునరావృతం చేస్తూ లోక్‌సభ ఎన్నికల శంఖారావం కూడా జిల్లాలోని ఇంద్రవెల్లి నుంచే పూరించింది. మరోపక్క పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం ఖానాపూర్‌లో మాత్రమే విజయం సాధించింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో బలోపేతం కోసం వివిధ రకాల ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన సీనియర్ నాయకులు కొందరు కాంగ్రెస్‌లో చేరగా.. ఆదిలాబాద్‌లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో సస్పెన్షన్‌కు గురైన ముఖ్య నాయకులను కూడా తిరిగి పార్టీలో చేర్చుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆ పార్టీవర్గాల ద్వారా తెలిసింది. ఎలాగైనా ఈ సారి ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో కచ్చితంగా విజయం సాధించాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆ రెండు పార్టీల కన్ను..!

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో ప్రస్తుతం బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తోంది. 2019లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి ఈ స్థానంలో విజయం సాధించిన బీజేపీ తాజాగా జరగనున్న ఎన్నికల్లోనూ సత్తాచాటాలని భావిస్తోంది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. పార్లమెంటు పరిధిలో ఏకంగా నాలుగు అసెంబ్లీ స్థానాలు గెలిచిన బీజేపీ ఈ స్థానంలో విజయంపై ధీమాతో ఉన్నట్లు కనిపిస్తోంది. ఇటీవల విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఆదిలాబాద్‌లో నిర్వహించిన సభకు ప్రధాని మోడీ హాజరుకావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఇది ఎన్నికల సభ కాదంటూనే..రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆయన కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ పార్టీ విజయ సంకల్ప యాత్ర సైతం ఈ పార్లమెంటు పరిధిలోనే ప్రారంభం కావడం ఈ సీటుపై ఆ పార్టీ ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. మరోపక్క రాష్ట్రంలో అధికారం కోల్పోయినా..లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటాలని బీఆర్ఎస్ భావిస్తోంది.ఈ పార్లమెంటు పరిధిలో బోథ్, ఆసిఫాబాద్‌లో మాత్రమే విజయం సాధించిన బీఆర్ఎస్ ఓట్లు మాత్రం గణనీయ సంఖ్యలో సాధించింది. నాలుగు అసెంబ్లీ సీట్లు గెలిచిన బీజేపీ కంటే బీఆర్ఎస్ 16,515 ఓట్లు అధికంగా సాధించడం విశేషం. ఈ లెక్కన లోక్‌సభ స్థానంలో విజయంపై బీఆర్ఎస్ సైతం నమ్మకం పెట్టుకుంది. సీట్లు లేకపోయినా..ఓట్లు అధికంగా ఉన్నాయనే భావనతో లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటి గత వైభవాన్ని చాటాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ పార్టీలో టికెట్ల హడావుడి కనిపించకపోయినా..నోటిఫికేషన్ తర్వాత అభ్యర్థిని పార్టీ అధిష్టానమే ఎంపిక చేస్తుందని ఆ పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఇలా మూడు ప్రధాన పార్టీలు ఎవరికి వారు ఈ సీటును కైవసం చేసుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నాయి. మరో నాలుగు రోజుల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్న దృష్ట్యా లోక్‌సభ ఎన్నికల వేడి మరింత రసవత్తరంగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అలేఖ్య కుటుంబానికి న్యాయం చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణ నడిరోడ్డుపై అత్యంత దారుణంగా హత్యకు గురైన చెట్పల్లి అలేఖ్య కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అలేఖ్య కుటుంబ సభ్యులతో పాటు నందిరామయ్య ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అలేఖ్యను అత్యంత దారుణంగా హత్య చేసిన ప్రేమోన్మాది జూకింది శ్రీకాంత్, అతనికి సహకరించిన తల్లి సత్తవ్వ, తమ్ముడు శివకృష్ణకు కఠిన శిక్షపడేలా విచారణ వేగవంతం చేయాలన్నారు. వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు అయ్యేలా చూడాలని ఎమ్మెల్యేని కోరారు. శ్రీకాంత్ చేతిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడిన మరో యువతి జయశీలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. శ్రీకాంత్ విచక్షణ రహితంగా నరకడంతో జయశీల చెయ్యి పూర్తిగా పనిచేయకుండా పోయిందన్నారు. భవిష్యత్తులో ఆమె ఏ పని చేసుకునే పరిస్థితి లేనందున ఆమెకు నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున చేపట్టాల్సిన అన్ని చర్యలను చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ నెల 10న తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవనున్న నేపథ్యంలో అలేఖ్య హత్య కేసు గురించి సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అలేఖ్య కుటుంబానికి న్యాయం జరిగేలా, తీవ్రంగా గాయపడిన జయశీలను ఆదుకునేలా తన వంతుగా సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మహిళా సాధికారతే లక్ష్యం



నవతెలంగాణ-ఇచ్చోడ

మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్యాల్ గ్రామంలో ప్రపంచ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళ సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళ సాధికారతకు తొలి బీజం పడిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడి మొట్టమొదటి సంతకం మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించే ఫైలుపై చేసి మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఉన్నటువంటి నిబద్ధతను నిరూపించుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 20కోట్ల మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ సంక్షేమ రాజ్యంలో రాబోయే రోజుల్లో మహిళలకు పెద్దపీట వేసి చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు తూచా తప్పకుండా పాటిస్తామని తెలపారు. కార్యక్రమంలో టిపిసిసి ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంరం కోటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్‌ఖాన్, పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి భీంరెడ్డి, ఎస్సీ సెల్ కార్యదర్శి బద్దుల జైపాల్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే పవర్ రామారావ్ పటేల్



నవతెలంగాణ-ముథోల్

నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయమని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని తరోడా తండా గ్రామంలో రూ.కోటీ4లక్షల నిధుతో బీటీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి రహదారి నిర్మాణం సరిగ్గా లేక అవస్థలు పడుతున్న గ్రామస్తులకు ఈ రోడ్డు నిర్మాణంతో తిప్పలు తప్పనున్నాయని తెలిపారు. నాణ్యతలో రాజీపడకుండా పనులు పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్‌ఖాన్, ఎంపిటిసి గంగాధర్, మాజీ సర్పంచ్ అరీఫ్, నర్సాగౌడ్, సురేందర్‌రెడ్డి, రమేష్, కోరి పోతన్న, కె.పోతన్న, శ్రీనివాస్, రవికిరణ్‌గౌడ్, కలీమ్, చిన్నన్న పాల్గొన్నారు.

రాజరాజేశ్వర స్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని గుడిసిర్యాల శ్రీరాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలొచ్చి రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. రాత్రి సమయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మున్యాల గోండు గూడెంలోని నాగ స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాంసి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం నుండి శివాలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయం పురాతన శివ ఆలయాల్లో ప్రత్యేక పూజ నిర్వహించారు. బోడగుట్ట దగ్గర గల శివాలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శివ లింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామేశ్వర ఆలయంలో శివ పార్వతులను డప్పులు మంగళహారతులతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. వేద పండితులు వీరయ్య, సతీష్ ఆధ్వర్యంలో శివ పార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, గ్రామస్తులు చినరాంరెడ్డి, రామన్న యాదవ్, మహేందర్‌రెడ్డి, కాంతారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అరుణ్, ఆశారెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలంలోని శివాలయాలలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బాబాపూర్‌లోని పురాతన రాజరాజేశ్వర ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్త్ నిర్వహించారు. బాబాపూర్ రాజరాజేశ్వర ఆలయం దగ్గర విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సునీల్ తన ఔన్నత్యాన్ని చాటుకున్నాడు. వెంగపేట్ గ్రామానికి చెందిన చిత్తరి శోభ జాతరలోయ పర్స్ పోగొట్టుకోగా కానిస్టేబుల్‌కు దొరికింది. మైక్‌లో అనౌన్స్ చేయించి పర్స్‌ను బాధితురాలికి అప్పగించాడు.

జైనథ్ : మండలంలోని పెండలవాడ గ్రామ హనుమాన్ దేవాలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. దేవాలయానికి పెనుగంగ అవతలి వైపు ఉన్న మహారాష్ట్రవాసులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులను తీర్చుకున్నారు. అంతేకాకుండా జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు ఆత్మలింగాన్ని దర్శించుకున్నారు. ఐదు రోజుల పాటు జాతర జరగనుంది.

సిరికొండ : రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ద్వారా పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్ గ్రామ సమీపంలోని పురాతన శివాలయాన్ని కుటుంబ సమేతంగా పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పురాతన కాలంలో వెలిసిన శివాలయాన్ని అభివృద్ధి చేయాలని, ఆలయానికి రహదారి, భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, ఆనంద్‌రావ్, అర్జున్, మాధవ్‌రావ్, శంభు పాల్గొన్నారు.

తలమడుగు : మహా శివరాత్రి పండగ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సుంకిడి, చర్లపల్లి, ఝరి గ్రామాలలో గల శివాలయాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ తోట వెంకటేష్, నియోజకవర్గం అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అభిరామిరెడ్డి, గంగాధర్, పొచ్చన్న, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



దస్తురాబాద్‌లో..



తాంసి



జైనథ్



లక్ష్మణచాంద

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యతకు కొదవలేదని, దాన్ని గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్ గ్రామంలో నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ పోటీలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను ముందుగా పరిచయం చేసుకున్న ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో ఎంతో నైపుణ్యత దాగి ఉంటుందన్నారు. అయితే వారికి గుర్తింపు లేక వెలుగులోకి రాలేకపోతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను చూడకుండా క్రీడల్లో రాణించాలని, ఈ క్రీడల వల్ల స్నేహ సంబంధాలు ఏర్పడడంతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవచ్చని సూచించారు. క్రీడాకారులకు తన వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, ప్రభాకర్, నాగరాజు, పెంటన్న, సంటెన్న పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీకాంత్‌రెడ్డి

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజార్షి షాను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా కాంగ్రెస్ నాయకులు తమ వంతు పూర్తి సహకారం అందించాలన్నారు. సంక్షేమ పథకాలు వారికి చేరే విధంగా చూడాలని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్, ఆదివాసీ జిల్లా చైర్మన్ ఆనంద్‌రావు, మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాగరాజు, ప్రభాకర్, పెంటన్న, అడెళ్లు, సంటెన్న ఉన్నారు.

బట్టలు పంపిణీ చేసిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-తలమడుగు

మహాశివరాత్రి సందర్భంగా రుయ్యాడి గ్రామ శివాలయంలో శుక్రవారం జడ్పిటిసి గణేష్‌రెడ్డి పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1998 సంవత్సరంలో శివాలయం నిర్మించినప్పట్నుండి ప్రతి సంవత్సరం హోమం, అభిషేకం, కళ్యాణం చేయిస్తూ పేదలకు వస్త్ర దానం చేస్తున్నామని తెలిపారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల పేదవారికి సొంత డబ్బులతో వస్త్ర దానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం 215 మందికి వస్త్రదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్‌రావు, గ్రామస్తులు వెంకన్న యాదవ్, డిఆర్‌డిఓ బిట్ల గంగన్న, గోక సంజీవ్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, గోనెల గంగన్న, కాంతారావు, అశోక్, వెంకటేష్, రాంరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, గాజుల సాంబశివ, దివాకర్, బాలాజీ, వెంకట్‌రెడ్డి, రాకేష్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పండగ పూట కొనసాగిన నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు నూతన రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి వద్ద 53 రోజుల నుంచి రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే శుక్రవారం మహా శివరాత్రి పండగ రోజు సైతం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాధన కమిటీ చైర్మెన్, ప్రధాన కార్యదర్శులు సిర్ర దేవేందర్, నిమ్మల నరేందర్ లు మాట్లాడుతూ ఆదిలాబాద్‌కు ఈనెల 4న దేశ ప్రధాని ఆదిలాబాద్‌కు వచ్చి వరాలజల్లు కురిపిస్తాడని అనుకుంటే నిరాశ మిగిల్చారన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇంకా 100 ఎండ్లు పరిపాలించిన ఆదిలాబాద్ సమస్యలు పరిష్కారం చేయరని మండిపడ్డారు. బీజేపీ, మోడీ తీరును, ఆదిలాబాద్ జిల్లా ప్రజలు గమనించి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చేపుతారని అన్నారు. రైల్వేలైన్ సాధించేంతవరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు మెస్రం భాస్కర్, రాములు, కేశవ్, వరుణ్ పాల్గొన్నారు.

టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలంలోని తెలంగ్‌రావు గూడ గ్రామంలో ఆదివాసీ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగియగా విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఆశావహ అభ్యర్థి కోవ దౌలత్‌రావు మొకాశి హాజరై, క్రికెట్ విజేత జట్టులైన ఇంద్రవెల్లి మండలంలోని దేవాపూర్ జట్టుకు ప్రథమ బహుమతిగా కప్పు అలాగే రూ.15వేల నగదు అందజేశారు. గుడిహత్నూర్ మండలంలోని తెలంగ్‌రావుగూడ జట్టుకు ద్వితీయ బహుమతిగా కప్పు రూ.10వేల నగదు, నేరడిగొండ మండలంలోని రేంగన్‌వాడీ జట్టుకు తృతీయ బహుమతిగా కప్పు రూ.5వేల 5వందల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గుడిహత్నూర్ మండల అధ్యక్షులు మల్యాల కరుణాకర్, ఆదివాసీ సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్, కోవ దౌలత్‌రావు సైన్యం అధ్యక్షులు కాత్లె బుచ్చన్న, లవాన్ పాల్గొన్నారు.

మహిళా బిల్లు తక్షణమే అమల్లోకి తేవాలి

- శ్రామిక మహిళల సమస్యలను పరిష్కరించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం లోకసభలో ఆమోదించిన మహిళా బిల్లును తక్షణమే అమల్లోకి తీసుకు రావాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.మంజుల, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక రాఘవులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ కాలనిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళాలకు కోసం తీసుకొచ్చిన మహిళా బిల్లు తక్షణమే అమల్లోకి తీసుకు వచ్చి, మహిళా సాధికారతకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళల జీవితాలు మరింత దారిద్ర్యంలోకి నెట్టబడ్డాయన్నారు. కనీస వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని, వ్యవసాయ కూలీల రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఇండ్లల్లో పనిచేసే మహిళల భద్రత, కనీస వేతనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆధునిక సమాజానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న, నేటికీ వివక్ష కొనసాగుతుందని, దానిని సమూలంగా నిర్మూలించేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తున్న మద్యపానాన్ని సంపూర్ణంగా నిషేధించాలని డిమాండ్ చేశారు. బీజేపీ హయాంలో మహిళలపై లైంగిక దాడులు పెరిగాయని అత్యాచారాలు అరికట్టడంలో పూర్తిగా విఫలం అయిందన్నారు. మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పొచ్చక్క, జిల్లా అధ్యక్షులు స్వామి, ఆశన్న, రేణుక, ఛాయబాయి, లత, అరిఫా, ప్రభు, కాలనివాసులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్, ఐద్వా ఆధ్వర్యంలో...

మహిళా హక్కుల సాధనకు ప్రతీ ఒక్కరూ ఉద్యమించాలని బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అన్నారు. టీఎస్‌యూటీఎఫ్, ఐద్వా, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో డైట్ కాలేజీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా ఈరోజు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగిపోతున్నారు. అదే సమయంలో వివక్షకు లోనవుతున్నవారు, అణచివేతకు గురవుతున్న వారు గొంతు విప్పాల్సిన అవసరం కూడా ఉంది. ప్రతీ మహిళ కూడా బాధితుల పక్షాన చేరి, ఐకమత్యాన్ని చాటాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. హక్కుల పరిరక్షణ కోసం సాగే ఉద్యమాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా అధ్యక్షులు ఎ.స్వామి, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సురేఖ, మహిళా సబ్ కమిటీ కన్వీనర్ కె.శ్రీలత, ఐద్వా జిల్లా కార్యదర్శి జమున, సీఐటీయూ బాధ్యులు వెంకటమ్మ టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాస్, ఇ.శివన్న, సోషల్ మీడియా కన్వీనర్ కె.శంకర్, మండలాల బాధ్యులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మహిళాలతో కలిసి కేక్ కట్ చేసి, తినిపించి మహిళ దినోత్సవ శుభాకంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళాలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికరత సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుత కాలంలో మహిళ శక్తి వెలుగు వెలుగుతోందన్నారు. సృష్టికి మూలం మహిళలు తమలోని శక్తిని గుర్తిస్తూ, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాళ్లు స్వరూప, మమత, పర్వీన్, సురేఖ, నాయకులు అజయ్, బండారి సతీష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మండల కేంద్రంలోని కుమురంభీం కాలనీలో అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం సభను ఆదివాసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోడం రేణుక, ఉయిక ఇందిర, ఆత్రం సుగుణ, నైతం సుమలత, చిట్యాల సుహాసినిరెడ్డి మాట్లడుతూ ఆకాశంలో సగం భూమిలో సగం ప్రపంచంలో సగభాగమైన స్త్రీ ఆధునిక యుగంలో కూడా వివక్షతకు గురవుతూనే ఉందని అన్నారు. అణచివేత, గృహహింస జరుగుతూనే ఉందన్నారు. ఈ క్రమంలో ఆదివాసీ మహిళల హక్కులను రక్షించిన మహిళా మణుల త్యాగాలను గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం డాక్టర్ నైతం సుమలత, ఆత్రం సుగుణక్క, సోయం లలిత, తుల్జాపూరే శోభ, కుమ్ర శాంతాబాయి, మావల మండల అధ్యక్షురాలు తర్పే తులసి, గెడం లీలావతి, వెట్టి పంచపూల, కనక యశోద, గోడం గణేష్, ఉయిక సంజీవ్, వెట్టి మనోజ్, దుర్గం రాజేశ్వర్, గద్దల శంకర్, కషావేణి నారాయణ, అజయ్, మెస్రం భాస్కర్, సలాం వరుణ్, మడవి గణేష్, రొడ్డ నారాయణ పాల్గొన్నారు.

ఉట్నూర్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రాంజీగోండ్ ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షులు, లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి అన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లోని రాంజీగోండ్ నగర్‌లో మహిళా ఉద్యమ నాయకురాలు మర్సుకొల సరస్వతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ మహిళలు అణిచివేత నుంచి విముక్తి పొంది అన్ని రంగాలలో రాణించడానికి సంసిద్ధులు కావాలని అన్నారు. ఆదిమ కాలం నుంచి ఆధునిక సమాజంలో కూడా నేటికీ మహిళలు హింసకు గురి అవుతూనే ఉన్నారని గుర్తు చేశారు. పురుషాధిక్యత గృహింస నేటికి మహిళల పట్ల కొనసాగుతూనే ఉందని అన్నారు. ఆచరణలో అన్ని రంగాలలో రాణించినప్పుడే నిజమైన స్త్రీ విముక్తి అని తెలిపారు. అందుకే మహిళలందరూ ఐక్యమై తమ సమస్యల సాధనకై ముందుకు నడవాలని అన్నారు. శ్రమ దోపిడి హింస పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు నేటికీ కొనసాగడం విడ్డూరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు మర్సుకొల సరస్వతి. కడమండ్ల రాజమణి, రాయిసెంటర్ సార్మేడి సలాం దేవరావు, రామ్‌జీగోండ్ నగర్ గ్రామ పటేల్ కాత్లే హుస్సేన్ రావ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్‌లో...



ఉట్నూర్‌లో...

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం కృషి చేస్తోందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా శాఖ అధ్యక్షులు వోడ్నాల రవిరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించేలా తమ సంఘం చొరవ చూపుతుందని తెలిపారు. తమ సంఘం నిరంతర కృషి వలన 317 జీఓ వలన తలెత్తిన సమస్యల పరిష్కారానికి మంత్రి దామోదర రాజనర్సింహా అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు అయిందని తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. దాదాపుగా 10 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో అంతర్‌రాష్ట్ర ఉద్యోగుల బదిలీలా పరిష్కారానికై స్వల్ప కాలంలోనే 4 సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని గుర్తు చేశారు. కేజీబీవీలకు మినిమం టైమ్ స్కేల్ అమలు, సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న వారికీ కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిదిగా విచ్చేసిన నిర్మల్ జిల్లా జెడ్పీటీసీల సంఘం అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం నిర్మల్ జిల్లా శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా యాటకారి సాయన్న, ప్రధాన కార్యదర్శిగా వోడ్నాల రవిరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులుగా సరికొండ శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎంసీ.లింగన్న, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణరావు, వ్యాయమ ఉపాధ్యాయ సంఘం నాయకులు వెన్నెల భూమన్న, భోజన్న పండిత పరిషత్ ఉపాధ్యాయ సంఘం నాయకులు గంగాధర్, పాండురంగాచారి, కేజీబీవీ ఉపాధ్యాయినుల జిల్లా ప్రతినిధి నవీత, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు భూసారపు గంగాధర్, కేజీబీవీ ఉపాధ్యాయినులు, ఐఈఆర్పీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపూర్ణ మద్యపాన నిషేధం



నవతెలంగాణ-ఉట్నూర్

నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో మద్యపాన నిషేధం చేయడం జరిగిందని గ్రామ పెద్ద నాయక్ తనాజీ రాథోడ్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. డీఎస్పీ సానూకులంగా స్పందించి పోలీసుల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో కారోబారి పృథ్వీరాజ్, దినేష్ పటేల్, ప్రహ్లాద్, కిషోర్ చావాన్, పశురాం జాదవ్, అనంద్‌రావ్ జాదవ్, పునిరాం చవాన్. శ్రీనివాస్ రాథోడ్, రామారావ్ చవాన్ పాల్గొన్నారు.

తొమ్మిదిన్నర ఏండ్లలో లబ్ది పొందని ఉపాధ్యాయులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సాధనలో క్రీయాశీలంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారని, కాని తొమ్మిదిన్నర ఎండ్లలో ఎలాంటి లబ్దిచేకూరకపోగా అవమానలు పడ్డారని పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాదవ సంఘ భవనంలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సంఘం ముందుండి పోరాడుతుందన్నారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందన్నారు. మేనిఫెస్టో కమిటీలో సభ్యుడిగా రెగ్యులరైజేషన్‌కు సాంకేతిక సమస్యలున్నాయని అన్నారు. అప్పటి వరకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని సూచించారు. త్వరలోనే అది అమలవుతుందన్నారు. కష్టకాలంలో తమకు మద్దతుగా నిలిచిన పార్టీయే నేడు తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయని భరోసా ఇచ్చారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

- భక్తజన సంద్రంగా మారిన ఆలయాలు
- వైభవంగా శివపార్వతుల కళ్యాణోత్సవాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తి ప్రపత్తుల నడుమ జరుపుకున్నారు. జిల్లాలోని ప్రధాన శైవక్షేత్రాలు భక్తులతో కిటకిట లాడాయి. శుక్రవారం ఉదయం నుండే శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హారతులు, రుద్రాభిషేకాలు, హోమ, యజ్ఞాది కార్యక్రమాలను భక్తి ప్రపత్తుల నడుమ జరిపారు. అటు పలు ఆలయాల్లో శివ పార్వతుల కళ్యాణ మహోత్సవాలను సైతం కన్నుల పండవగా చేపట్టారు. భక్తులు భక్తి శ్రద్దల నడుమ ఉపవాసం ఉండి, భోలా శంకరుడిని ఆరాధించారు. ప్రధాన ఆలయాల్లో భక్తుల తాకిడి పెరిగిపోవడంతో ఆలయ కమిటి నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బారికేడ్లు, షామియానాలు, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించింది.గంగాపుత్ర శివాలయంలో ఉదయం నుండే రుద్రాభిషేకం తో పాటు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అంకోలి రహదారి వైపు వెళ్లే మార్గంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో సైతం మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాంనగర్‌లోని శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. రవీంద్రనగర్‌లోని ఉమామహేశ్వర ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా చేపట్టారు.

శివాలయంలో ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా పూజలు...

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పట్టణంలోని గంగపుత్ర శివాలయంలో కుటుంబ సమేతంగా అభిషేకాది పూజలు నిర్వహించారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రాజరాజేశ్వర ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు.

సిరికొండ : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామున నిద్ర లేచి, ఇండ్లను శుభ్రం చేసుకోని, ఉదయం నుండే ఆలయాల్లో రుద్రాభిషేకాలు, శివునికి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో వీధుల గుండా పల్లకి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణం చేశారు. మండలంలోని కొండాపూర్ గ్రామ సమీపంలోని పురాతన శివాలయం ఉంది. జాతర సందర్భంగా వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పురాతన శివాలయం కావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

ఉట్నూర్ : శివరాత్రి పర్వాదినాన్ని పురస్కరించుకొని శివాలయాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. హరహర మహాదేవ ఆలయంలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మెన్ రవీందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రామాలయ మందిరంలో శుక్రవారం ఆదిలాబాద్ జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్ కుటుంబ సమేతంగా శివున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఇంద్రవెల్లి : మహాశివరాత్రిని మండల ప్రజలు భక్తి శ్రద్ధతో జరుపుకున్నారు. దినమంతా ఉపవాసదీక్షలు చేపట్టిన భక్తులు శివాలయానికి బయలు దేరారు. మండలంలో శివాలయం లేక పోవడంతో పక్క మండలాలైన సాలేవాడ, గుడిహత్నూర్, ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ తదితర ఆలయాలకు వెళ్లి దర్శనం కోసం బారులు తీరారు. అనంతరం రెండో రోజున పవిత్ర ఉపవాస దీక్షను విరమింప చేశారు.

ఎయిర్‌టెల్ సిగ్నల్ అందక నానా తిప్పలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల ఎయిర్‌టెల్ వినియోగదారులకు సిగ్నల్ అందక నానా తిప్పలు పడుతున్నారు. మండలంలోని శంకర్‌గూడ, దేవాపూర్, మెండపల్లి, ధనోర(కె, తదితర గ్రామాల ప్రజలకు ఫోన్ మాట్లాడాలంటే చెట్లు, ఇంటిస్లాబ్‌పై ఎక్కాల్సిందేనని వినియోగదారులు వాపోతున్నారు. ఒక్కోసారి స్విచ్‌ఆఫ్, సిమ్ కార్డు వినియోగంలో లేదంటూ, ఈ ఫోను తాత్కాలికంగా పని చేయడం లేదంటూ అబద్ధపు సాకులు చెబుతుండటంతో వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. సంభందిత ప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముత్నూర్ గ్రామంలో ఉన్న ఎయిర్‌టెల్ టవర్‌కు గత నెలలో జరిగిన కేస్లాపూర్ నాగోబా జాతరకు సిగ్నలింగ్ ఫ్రీక్వెన్సీ పెంచిన ఆ శాఖ అధికారులు జాతర ముగింపు తరువాత సరి చేయక పోవడంతో వినియోగదారులకు సిగ్నల్ సమస్య ఏర్పడిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పై గ్రామాలకు సిగ్నల్ వ్యవస్థ మెరుగుపర్చాలని వినియోగదారులు కోరుతున్నారు. లేని యెడల తాము ఆందోళన బాట పడతామని ఎయిర్‌టెల్ సంస్థ ప్రతినిధులను హెచ్చరిస్తున్నట్టు పేర్కొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | మార్చి 09, 2024 | www.navatelangana.com

హరీష్‌రావు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుబంధు డబ్బులు ఆపి ఏసీ రూముల్లో కూర్చునే ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు చెల్లించిందంటూ మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శాంతి కుమారి, ఇందురావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ప్రజల్లో వ్యతిరేక వైఖరి వచ్చేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలంగా ఉండడం ప్రతిపక్ష పార్టీకి నచ్చడం లేదని, గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులు ఈఎంఐలు కూడా సరైన సమయంలో కట్టలేని దుస్థితిలో ఉండే వారన్నారు. ఈ విషయాన్ని మరిచి హరీష్ రావు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని వాటిని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హేమంత్ షిండే, ఉషన్న, రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి పల్లకి ఊరేగింపు

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ వెంకటేశ్వర స్వామి పల్లకి రథయాత్ర వైభవంగా సాగింది. వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి ప్రారంభమైన పల్లకి శోభ యాత్ర శివాలయంతో పాటు పలు వీధుల గుండా ఊరేగించారు. స్వామి వారి పల్లకీకి మహిళలు, భక్తులు అడుగడుగునా మంగళ హారతులతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఈ రథ యాత్రలో నిర్వహకులు దండుగుల ఎల్లప్ప, కళ్లప్ప, చెన్నప్ప, గిడ్డప్ప గ్రామస్తులు ఉత్తం నాయక్, గోగర్ల రాజయ్య, నారాయణ్, కోట్రంగే తిరుపతి పాల్గొన్నారు.శుక్రవారం ప్రారంభమైన జాతర వారం రోజుల పాటు కొనసాగనుంది. జిల్లాలోని తిర్యాని, వాంకిడి, జైనూర్, సిర్పూర్(యు), లింగపూర్, నార్నూర్, ఆసిఫాబాద్, ఉట్నూర్ తదితర మండలాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు తరలి వస్తారు. జాతర నిర్వహణ కమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లు చేస్తున్న ఆలయ పూజారి మంజుల తిరుపతి తెలిపారు.

మహిళల అస్తిత్వానికి ప్రతీక మహిళ దినోత్సవం

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల అస్తిత్వానికి ప్రతీక మహిళ దినోత్సవమని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు సతీష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకలకు జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచంలో అన్ని దేశాల్లో పురుషుల కంటే మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారన్నారు. ఏ దేశంలో అయితే మహిళకు ప్రత్యేక స్థానం ఇవ్వడం జరుగుతుందో ఆ దేశం ఉన్నత స్థాయిలో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి మాట్లాడుతూ మహిళలకు ఉన్న జ్ఞానాన్ని అందరికీ పంచి సమాజాన్ని అభివృద్ధి చేసే దిశలో ముందుంటారన్నారు. ఇంట్లో మహిళ విద్యావంతురాలు అయితే ఆ ఇల్లు సరైన విధంగా ఉంటుందన్నారు. మహిళలకు ప్రస్తుతం స్వేచ్ఛ ఉందని దాన్ని వథా చేయకూడదని సరైన విధంగా వినియోగించుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం మహిళలను శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పరిషత్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాపర్తి గాయత్రి, సీనియర్ న్యాయవాది రజీహైదర్, రాపర్తి రవీందర్, రాజీవ్ రెడ్డి, శ్రీదేవి, స్వప్న పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మున్సిపాలిటీ కార్యాలయంలో కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా కార్మికులను సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల శక్తి ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సిబ్బంది సంతోష్, శంకర్, బాపు, నాగేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరుకు పంట..లాభాల బాట

- చెరుకు పండిస్తున్న ధనోర, గోయాగాం రైతులు
- వ్యవసాయాధికారుల ప్రోత్సహం కరువు



ధనోరలో చెరుకు పంట

నవతెలంగాణ-కెరమెరి

మండలంలో వందశాతం రైతులు పత్తి పంట వైపే మొగ్గుచూపుతున్నారు. ఏండ్ల తరబడి పత్తి పండించడంతో పంట దిగుబడి రాక రైతులు నష్టాలను చవి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పంట మార్పిడి పద్ధతులపై సరైన అవగాహన లేక ప్రతి ఏటా పత్తిసాగు చేస్తున్నారు. అందుకు భిన్నంగా ఆలోచించారు గోయాగాం గ్రామానికి చెందిన రైతు శంకర్, ధనోరకు చెందిన మరో రైతు. చెరుకు పంటతో లాభాలు గడించవచ్చని తమకు ఉన్న కొద్ది భూమిలో చెరుకు పంట వేశారు. చెరుకు పంట చేతికొచ్చి ప్రస్తుతం రోజుకు సుమారు రూ.1500 సంపాదిస్తున్నారు. కెరమెరి నుండి ఆసిఫాబాద్ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి పక్కనే చెరుకు పంటను పండిస్తుండడంతో లాభాలు పొందుతున్నారు.

నాలుగు నెలల పాటు భలే గిరాకీ

ధనోర, గోయాగాం గ్రామాల వద్ద గల పంట చేన్ల వద్దనే చిన్నపాటి కొట్టు ఏర్పాటు చేసుకొని చెరుకు రసాన్ని తీసి విక్రయిస్తున్నారు. వేసవి కాలం కావడంతో రాకపోకలు కొనసాగించే ప్రయాణికులు చెరుకు రసం కోట్టు వద్ద కాసేపు సెదతీరి చెరుకు రసాన్ని తాగుతున్నారు. దీంతో ప్రయాణికులు స్వచ్ఛమైన కల్తీ లేని రసం కోసం పోటీ పడుతున్నారు. వేసవిలో నాలుగు నెలల పాటు ఉపాధి పొందుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందుతున్నారు.

ఒక్కసారి విత్తనం వేస్తే చాలు...

పొలంలో ఒక్కసారి చెరుకు విత్తనం నాటితే చాలు మూడు సంవత్సరాల పాటు అదే పంట ఉంటుంది. మరోసారి విత్తనం నాటాల్సిన అవసరం ఉండదు. ఎరువులు, సాగు నీటిని సకాలంలో అందిస్తే సరిపోతుంది. ఎకరా సాగు చేసేందుకు రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. చేను దున్నకం, ఎరువులు, విత్తనం, కూలీల కోసం వెచ్చించాల్సి ఉంటున్నది. పొలంలో చెరుకు విత్తనం నాటిన నుంచి తొమ్మిది నెలల తర్వాత పంట కోతకు వస్తుంది. తొమ్మిది నెలల నుంచి సంవత్సరం గడిచే వరకు ఎప్పుడైనా చెరుకు కోతలను ప్రారంభించే అవకాశం ఉంటుంది. చేనులో ఏపుగా పెరిగిన గడలను సేకరిస్తారు. పొలంలో నాటిన తర్వాత ఎరువులు, సాగు నీటిని సకాలంలో అందించాలి. అప్పుడే చెరుకు తోట ఏపుగా పెరుగుతుంది. ఎకరానికి రూ.30వేల పెట్టుబడితో రూ. లక్షకుపైగా ఆదాయం వస్తుంది. ఎకరానికి సుమారు 20 నుంచి 30టన్నుల చెరుకు ఉత్పత్తి అవుతున్నది.

ప్రోత్సహం అందిస్తే మరింత సాగు

వ్యవసాయ అధికారులు తూతూ మంత్రంగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు తప్పితే రైతులకు వాణిజ్య పంటలతో వచ్చే లాభాలపై పూర్తి స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి చెరుకు పంటలో మేలుకువలు అందిస్తే మండలంలోని రైతులు చెరుకు సాగుకు ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. కానీ ఆ దిశగా వ్యవసాయ శాఖ అధికారులు ప్రయత్నించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యామ్నయ, లాభాదయాక పంటలపై అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.



చెరుకు రసం తీసి ఇస్తున్న రైతు

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

- అప్‌డేట్ కోసం జనాల తంటాలు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలో ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ ప్రతి ప్రభుత్వ పథకాల్లో తప్పనిసరి కావడం, ఈ నెలలోపు నమోదు, అప్‌డేట్ చేసుకోకుంటే ఇక నుండి ప్రభుత్వ రుసుము చెల్లించాలని ఊహాగానాలు వస్తుండడంతో ప్రజలు ఆందోళన చెంది ఆధార్ కేంద్రాలున్న కాగజ్‌నగర్, ఈజ్‌గాం, కౌటాల తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లి ఆధార్ అప్‌డేట్, నమోదు చేసుకుంటున్నారు. మండల కేంద్రంలో పోస్టాఫీసులో మూడు నెలల క్రితం ఆధార్ కేంద్రం ఏర్పాటుచేశారు. రెండు నెలలు మాత్రమే వినియోగదారులకు సేవలు అందించారు. ప్రస్తుతం సుమారు నెల రోజుల నుండి ఆధార్ కేంద్రం పనిచేయడం లేదు. దీంతో ఆధార్ నమోదు, నవీకరణ కోసం అనేక తంటాలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ఏ పథకానికైనా ఆధార్ తప్పనిసరి చేశారు. ఆధార్ సేవా కేంద్రం లేకపోవడంతో మండలంలో వివిధ గ్రామాలకు చెందిన సామాన్య ప్రజలు రోజుల తరబడి కాగజ్‌నగర్, ఈజ్‌గాం, కౌటాల ఆధార్ కేంద్రాలకు ఉదయం సమయంలో వెళ్తున్నారు. కానీ ఇప్పటి ప్రభుత్వం ఆధార్ ఉన్న వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పడంతో ఆధార్ కేంద్రాలకు వెళ్లి పడిగాపులు కాసి వాటిని సరిచేసుకుంటున్నారు. ఇప్పటికైనా యూడీఐ, ప్రభుత్వ అధికారులు స్పందించి మండలంలో ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని, మిగతా మండలాల్లో ఆధార్ సేవా కేంద్రాలు ఉన్నాయని, నియోజకవర్గ కేంద్రంలో లేకపోవడం సిగ్గుచేటని అంటున్నారు. ఇదేనా పేద సామాన్య ప్రజలకు చేస్తున్న సేవలు కనీసం ఇలాంటి సేవలను అందించడంలో అధికారులు, నాయకులు విఫలమవుతున్నారని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పోస్టుమాస్టర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా యూడీఐ సంస్థ వారికి ఫిర్యాదు చేసినట్టు, కంప్యూటర్‌లో ఆధార్ ఓఎస్ ఆధునీకరణ చేయాలని నివేదికలు పంపించినట్టు, కొన్ని రోజుల్లో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.



మూలనపడ్డ కంప్యూటర్

మానవ సంబంధాలు పెంపొందించేందుకు యాత్ర



నవతెలంగాణ-సిర్పూర్(టి)

నేటి ఆధునిక యుగంలో రోజురోజుకు మానవ సంబంధాలు లేకుండా పోతున్నాయని, దీనిని పెంపొందించడానికి దేశంలోని ప్రతి రాష్ట్రాన్ని కలుపుకుంటూ రాజీవ్‌కుమార్ మహతో సైకిల్ యాత్ర చేస్తున్నారు. ఢిల్లీ నుండి ప్రారంభించిన ప్రారంభమైన యాత్ర హర్యానా, చండీఘడ్, పంజాబ్, జమ్మూకాశ్మీర్, లడక్, హిమచల్‌ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తర్‌ఖండ్ మీదుగా తిరిగి ఢిల్లీకి అక్కడి నుండి రాజస్తాన్, మహారాష్ట్ర, గోవా, కర్నాటక, తమిళనాడు నుండి ప్రస్తుతం తెలంగాణకు చేరారు. మానవత్వం మెల్లిమెల్లిగా నేటి ఆధునిక కాలంలో ముగుస్తుందనే భావనతో మానవత్వమంటే ఏమిటో మన సంస్కృతిలో మనం ఏది మాట్లాడుతున్నామో అందరికి అవగాహన కల్పించేందుకు యాత్రను చేపట్టినట్టు రాజీవ్ కుమార్ తెలిపారు. ఈ యాత్రలో భాగంగా సిర్పూర్ మండల యువకులు, మాజీ వార్డు సభ్యుడు ఇఫ్తుత్ హుస్సేన్, యువకులు మౌశద్‌ఖాన్, శ్యాంరావు, దుర్గం సురేష్, తిరుపతి, జావిద్ శాలువాలతో సన్మానించారు.

గణిత టీచర్ లేక ఇంటికెళ్లిన కేజీబీవీ విద్యార్థులు

- తిరిగి తీసుకువచ్చిన ఉపాధ్యాయులు
- ఫలించని అవగాహన



నవతెలంగాణ-చింతలమానెపల్లి

మండలంలోని కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం(ఎంపీసీ) చదువుతున్న 14 మంది విద్యార్థినులు గురువారం గణితం బోధించే టీచర్ లేకపోవడంతో విద్యార్థులు పరీక్ష సరిగా రాయలేదని కేజీబీవీ పాఠశాల నుండి ఇంటికి తిరిగి వెళ్లిన విషయం తెలిసిందే.శుక్రవారం కేజీబీవీ టీచర్లు విద్యార్థుల ఇళ్లలోకి వెళ్లి వారిని సముదాయించి తిరిగి కేజీబీవీ పాఠశాలకు తీసుకోవచ్చారు. అనంతరం కేజీబీవీ పాఠశాలకు జిల్లా ప్రత్యేక అధికారి సుభాష్, జిల్లా సైన్స్ వికలాంగుల సెక్షన్ అధికారి మధుకర్, చైల్డ్‌లైన్ అధికారి ప్రవీణ్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, మీకు మ్యాస్ బోధించేందుకు ప్రత్యేకంగా ఇద్దరు సీఆర్టీలను నియమించడంతో పాటు ఎంసెట్ కోచింగ్ కూడా ఇప్పిస్తామని భరోసా కల్పించారు. ద్వితీయ సంవత్సరం రెండు పరీక్షలు అనంతరం ప్రత్యేకంగా మీకు తరగతులు ప్రారంభిస్తామని విద్యార్థులకు అవగాహన కల్పించినప్పటికీ ఇన్‌చార్జి ఎస్ఓ శ్రీదేవిను డీఈఓ ఆదేశాల మేరకు బదిలీ చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు మీరు ఎప్పుడైనా పాఠశాలకు వచ్చి సీఆర్టీ నుండి విద్యాభ్యాసం పొందవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఎంత చెప్పినప్పటికీ కూడా ఇంటి నుండే పరీక్షలకు హాజరవుతామని చెప్పి తల్లిదండ్రులతో ఇంటికి వెళ్లి పోయారు.

శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

- జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో భక్తుల రద్దీ
- జాతరకు ప్రత్యేక బస్సులు



ఆసిఫాబాద్



వాంకిడి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలోని శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ఉదయం 5 గంటల నుండి ఆలయాల్లో పూజారులు ప్రత్యేక పూజలు ప్రారంభించారు. శివుని దర్శనం చేసుకోవడానికి ఆయన కటాక్షం పొందడానికి ప్రతి ఆలయంలో వేల సంఖ్యలో భక్తులు బారులు తీరారు. జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్‌లో గల శివాలయంలో శివ కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. జిల్లా కేంద్రంలోని ప్రజలు పెద్ద ఎత్తున శివ కళ్యాణానికి హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉత్సవ విగ్రహాలతో శోభయాత్ర నిర్వహించారు. అలాగే పెద్ద వాగు ఒడ్డున గల బాలేశ్వర ఆలయం కూడా భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని బూరుగుడ, గుండి, మొతుగూడ గ్రామాలలో ఉన్న శివాలయాలు ఉదయం నుండి రాత్రి వరకు భక్తుల రద్దీకొనసాగింది. బూరుగుడ శివాలయంలో శివ కళ్యాణం, పల్లకి ఊరేగింపు రథోత్సవం అలరించింది. సందర్భంగా గుడి ఆవరణలో దుకాణ సముదాయాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయంలో నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గుండి ఆలయంలో లక్కీడ్రా

మండలంలోని గుండి గ్రామంలోని శివాలయంలో శివరాత్రి వేడుకలను పురస్కరించుకొని లక్కీ డ్రా నిర్వహించారు. లక్కీ డ్రా మొదటి బహుమతి స్కూటీని వాంకిడి మండలానికి చెందిన జవాజి సురేష్ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రవీందర్, బిక్కాజి, దత్తు పాల్గొన్నారు

ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు

ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో వాంకిడి మండల కేంద్రంలో జరిగే జాతర, కాగజ్ నగర్ మండలంలోని ఈజ్గాం ఆలయం, రెబ్బెన మండలం నంబాలలో జరిగిన మహా శివరాత్రి వేడుకలకు ప్రత్యేక బస్సులను నడిపించారు. జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్ నుండి ప్రత్యేక బస్సులు భక్తుల కోసం ఏర్పాటు చేశారు.

శివరాత్రి వేడుకల్లో ప్రముఖులు

జిల్లాలో శుక్రవారం జరిగిన శివరాత్రి వేడుకల్లో ప్రముఖులు పాల్గొన్నారు. మండలంలోని గుండి గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ మల్లికార్జున్, ఎంపీటీసీ మల్లేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండి తాజా మాజీ సర్పంచ్ జబరి అరుణ-రవీందర్, మాజీ సర్పంచ్ సెండే దత్తు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దాంపెల్లి శ్యామ్ రావు, వార్డు సభ్యులు మల్లేష్, రోజా రాజు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా అటూ తిర్యాని మండలంలోని మొహింద గ్రామంలో నిర్వహించిన వేడుకలు మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బెజ్జూరు : మండలంలోని రంగనాయక శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివుడికి అభిషేక కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం శివపార్వతుల కళ్యాణాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి ఆలయాలకు భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బిల్వాక్షర, పంచామృత పూజను నిర్వహించారు.

పులిహోరా, స్వీట్లు పంపిణీ

శివరాత్రిని పురస్కరించుకొని వివిధ గ్రామాల నుండి ఆలయానికి వస్తున్న భక్తులకు శుక్రవారం కాగజ్‌నగర్‌కు చెందిన సంజయ్ కిరాణ ఆధ్వర్యంలో పులిహార పంపిణీ చేపట్టగా శక్తి డెయిరీ కనికుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మజ్జిగ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిలేబీ, అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే కనికుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రంగనాయక స్వామి క్యాలెండర్లను పంపిణీ చేశారు. వివిధ గ్రామాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం వీటిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగిడిపెల్లి మహేష్, ఎస్ఐ విక్రమ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు బూస శంకర్, అయ్యప్ప భక్తులు మిర్యాల వెంకటరమణ, సామల రవికాంత్, భీంరావు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే భక్తులు ఆలయానికి చేరుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ జాతరకు మహారాష్ట్రలోని రాజుర, లకడ్‌కోట్, వరూర్, విరూర్, చంద్రాపూర్, ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్, వాంకిడి తదితర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని శివకేశవ ఆలయ కమిటీ చైర్మన్ గాదె ప్రవీణ్ తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం రథం ఊరేగింపు నిర్వహించారు.

శివాలయంలో జిల్లా ఎస్పీ పూజలు

మండలతకేంద్రంలోని శివకేశవ ఆలయంలో మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్ పూజలు నిర్వహించారు. భక్తులందరికి ఆయన మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుని ఆశిస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గాదె ప్రవీణ్‌కుమార్ ఎస్పీని శాలువతో సన్మానించారు. ఆయన వెంట ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, ఆలయ కమిటీ సభ్యులు, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చింతలమానేపల్లి : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కర్జెల్లి గ్రామ ముసలమ్మ గుట్ట ఆలయ జాతరలో క్రియేటింగ్ స్మైల్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోట సాయి క్రిష్ణ ఆధ్వర్యంలో భక్తులకు మంచినీటి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోట శంకరయ్య, మెట్టపల్లి బ్రహ్మానందం చారి, బండార అంజన్న, నికడి సుధాకర్, లక్ష్మణ్, కిరణ్, హరి, విజయ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని ఈజ్ గాం శివమల్లన్న స్వామి ఆలయం మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా శుక్రవారం భక్తజనసంద్రంగా మారి శివనామస్మరణతో మారుమోగింది. ఉదయం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు శివాణీ దంపతులు, ఆలయ చైర్మన్ మైలారపు మురళీధర్ దంపతులు గర్భగుడిలోని శివలింగం వద్ద రుద్రాభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. సూర్యోదయానికి ముందే శివమల్లన్న స్వామిని దర్శించుకోవాలని ఉదయం నుంచే ఆలయానికి భక్తుల తాకిడి ప్రారంభమైంది. క్రమక్రమేణ భక్తుల సంఖ్య పెరిగి ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. స్వామివారి దర్శనానికి మూడు క్యూలైన్లు ఏర్పాటు చేయగా బారీకేడ్లు నిండిపోయాయి. జాతరకు కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలోని భట్టుపల్లి, అందవెల్లి, ఈజ్‌గాం, నజ్రూల్ నగర్ మార్కెట్ తదితర గ్రామాల భక్తజనం తరలివచ్చారు. క్రమ పద్ధతిలో దర్శనం చేయించడానికి కొంతమంది యువకులు, పిల్లలు వాలంటరీలుగా సేవలందించారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు ఈఓ వేణుగోపాల్ గుప్తా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పలు ప్రభుత్వశాఖలు, స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగా, పండ్లు పంపిణీ చేశాయి. బీజేపీ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ, కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేయగా కాపువాడ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ, స్నేహ బంధం యూత్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ చేసి భక్తి భవం చాటారు. సాయంత్రం స్వామివారి కళ్యాణోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ శివాణీ దంపతులు జరిపించారు. జాతర సందర్భంగా కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు బందోబస్తు చేపట్టగా బందోబస్తును జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ పర్యవేక్షించారు.



కాగజ్‌నగర్ రూరల్



బెజ్జూర్

గురుకుల ప్రధానోపాధ్యాయురాలికి ఉత్తమ మహిళా అవార్డు

నవతెలంగాణ-రామకష్ణాపూర్



అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం పట్టణ బాలికల గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమ రాణి ఉత్తమ మహిళా అవార్డు పొందారు. జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ చేతుల మీదుగా ఉత్తమ మహిళా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రేమరాణి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా పురస్కారం అందుకోవడం చాలా ఆనందం గా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఆర్ సిఓ స్వరూప రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రత్యేక బృందం

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ భూముల అక్రమణాలను నిరోధించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ హరికృష్ణ తెలిపారు. ప్రత్యేక బృందంలో పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులను భాగస్వామ్యం చేసినట్లు పేర్కొన్నారు. భూములపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బెల్లంపల్లి రూరల్, అర్బన్ మండలంలో విలువైన ప్రభుత్వ భూములను భూకబ్జాదారులు అక్రమిస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. పత్రాలు లేకుండా బోగస్ ఇంటి నెంబర్లను పొందుతున్నారన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా బృందాల ఏర్పాటు కోసం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో బృంద సభ్యులు పనిచేస్తారని వివరించారు.

దేశ భవిష్యత్తు మహిళలపై ఆధారపడి ఉంది





నవతెలంగాణ-నస్పూర్

రానున్న రోజుల్లో దేశ భవిష్యత్తు మహిళలపై ఆధారపడి ఉందని, ప్రపంచంలో సగభాగమైన మహిళలు ప్రతి రంగంలో చురుగ్గా రాణిస్తున్నారని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్కే-8 డిస్పెన్సరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడాంశాలలో గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రధానోత్సవం, మహిళా దినోత్సవ సందర్భంగా నస్పూర్, శ్రీరాంపూర్ డిస్పెన్సరీల నుండి ఉత్తమ ఉద్యోగినుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెల ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస పత్రాలను జీఎం చేతుల మీదుగా అందిస్తున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో సగభాగమైన మహిళలు అన్ని రంగాలలో తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శిస్తున్నారని, దేశ అత్యున్నత స్థానంలో కూడా మహిళలు ఉండడం సంతోషించదగిన విషయమన్నారు. మహిళలు ఆర్మీ, పోలీస్, నౌకాదళం వంటి రంగాలలో తమ ప్రతిభ పాటలను ప్రదర్శించి దేశ రక్షణలో భాగస్వాములు అవుతున్నారన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత సింగరేణి సంస్థలో కూడా మహిళలు అత్యధికంగా ఉద్యోగాలను పొంది తమకు నిర్దేశించిన పనులను విజయవంతంగా నిర్వర్తిస్తున్నారని, రాబోవు రోజులలో కూడా భూగర్భంలో వెళ్లి మహిళలు పురుషులతో సమానంగా తమ వృత్తి బాధ్యతలను నిర్వర్తించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కే వెంకటేశ్వర రెడ్డి, కేంద్ర నాయకులు ఏవీ రెడ్డి, ఎస్ఓ టూ జీఎం వి.పురుషోత్తమ రెడ్డి, ఏజీఎం మురళీధర్, డీజీఎం పర్సనల్ పి. అరవింద రావు, డీవై సీఎంఓ డా. రమేష్ బాబు, డా. మురళీధర్, డా. వేదవ్యాసు, డా.లోకనాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు డిపార్మెంట్లపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరు కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో....

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జెట్టి శంకర్ రావు ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, డిపార్మెంట్లలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి జనక్ ప్రసాద్ పాల్గొన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న సీనియర్ మహిళలను శాలువాలతో సన్మానించి స్వీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గార్మెంట్ ఫ్యాక్టరీలో మహిళలపైన జరుగుతున్న వివక్షత, అణిచివేతలకు, శ్రమ దోపిడీకి అరాచకతత్వానికి వ్యతిరేకంగా ఆనాడు మహిళలు చేసిన పోరాటాలు సాధించిన విజయాల గుర్తుగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జాతీయ సభ్యులు భీమ్‌రావు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గరిగే స్వామి, ఉపాధ్యక్షులు కలవేన శ్యామ్, మైనింగ్ స్టాఫ్ నాయకులు తిరుపతి రాజు, కేంద్ర నాయకులు ల్యాగలా శ్రీనివాస్, ఏరియా కార్యదర్శులు విజయ్ పాల్ రెడ్డి, సమ్మిరెడ్డి, సహాయ కార్యదర్శి సంతోష్, జిల్లా కార్యదర్శి భీమ్‌రవి, జిల్లా ఉపాధ్యక్షులు జంజుపెల్లి నర్సింగ్, నాయకులు రమేష్, పెంటం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాసిపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాసిపేట గనిపై గుర్తింపు కార్మిక సంఘం, యాజమాన్యం ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా కాసిపేట గని మేనేజర్ అల్లావుద్దీన్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్ హాజరై మహిళ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ మహిళలు ముందు ఉండడం వల్లనే సమాజం నిర్మితమవుతుందని, ఎవరికి తక్కువ కాకుండా అన్ని రంగాలలో ముందుకు సాగుతున్నారన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ ప్రపంచాన్ని శాసించిన వారిలో మహిళల భాగస్వామ్యం ఎక్కువన్నారు. అంతకు ముందు కేక్ కట్ చేసి మహిళ దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర కోకన్వీనర్ బన్న లక్ష్మన్ దాస్, ఇంజనీర్ గుగ్లోత్ బాబు, సంక్షేమ అధికారి జీషాన్, సర్వేయర్ ఖాన్, జనార్ధన్ రెడ్డి, నాగేశ్వరరావు, ఓవర్ మేన్ మురళి, తన్వీర్, శ్రీదర్, శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు

జన్నారం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం, మండలంలోని రేండ్లగూడ గ్రామలలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేరువేరుగా మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలను శాలువాలతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ఎంపీటీసీల పోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్ మాట్లాడుతూ మహిళలు లేకపోతే ప్రపంచమే లేదని, మానవ మనగడ సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మాణిక్యం, సీనియర్ నాయకులు ఏనుగు సుభాష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు మామిడిపల్లి ఇందయ్య, దుమల రమేష్, సాదు పాషా, రేండ్లగూడ ఎంపీటీసీ దాముక మమత కరుణాకర్, టేకుమట్ల పంకజ, దుర్గం లక్ష్మీనారాయణ, అజ్మీర నందు నాయక్, ఎండీ అజారుద్దీన్, రమేష్, షాకిర్ అలీ, బీరవెల్లి రాజన్న, గంగన్న పాల్గొన్నారు.

తాండూర్ : బాలికలు అన్ని రంగాల్లో రాణించే విధంగా వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్ఓ సుమన చైతన్య తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ దినోత్సవ ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేశారు.





ప్రభుత్వ భూములను కాపాడాలి



నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే తండ్రి కాకా వెంకటస్వామి పేరున కాలనీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడుతున్నరన్న వ్యవహారాన్ని ఆయన తప్పు పట్టారు. ఎటువంటి అర్హత పత్రాలు లేకుండా ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై రెవెన్యూ, పోలీస్ అధికారులు శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రాణహితకు పోటెత్తిన భక్తజనం

- నారాయణరావు జ్ఞాపకార్థం అల్పాహారం పంపిణీ



నవతెలంగాణ-వేమనపల్లి

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేమనపల్లి ప్రాణహిత నదికి భక్తులు పోటెత్తారు. ప్రాణహిత నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి కాకుండా పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నదిలో నీరు ఎక్కువ దూరం ఉండడంతో భక్తులు ట్రాక్టర్, ఎడ్లబండ్ల ద్వారా నదికి చేరుకొని స్నానాలు ఆచరించారు. భక్తులకు రుద్రభట్ల నారాయణ రావు జ్ఞాపకార్థం నీల్వాయి ఎంపీటీసి రుద్రభట్ల సంతోష్ కుమార్ అల్పాహారం ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా బాలాజీ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన దీకొండా జతిన్ బాలాజీ గౌడ్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ వర్ధన్ రాజు నియామక పత్రాన్ని అందజేసారు. అనంతరం జతిన్ బాలాజీ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకాన్ని ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే లోకసభ ఎన్నికల్లో పెద్దపెల్లి ఎంపీని గెలిపించడంలో కృషి చేస్తానని తెలిపారు.

వేలాల జాతరలో మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-జైపూర్

మహాశివరాత్రి పండుగ సంధర్భంగా వేలాల మల్లన్న దర్శనార్థం తరలివచ్చే భక్తులకు అంజనీ పుత్ర సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేలాల గ్రామంలో ఏర్పాటు చేసిన వేధిక మీదుగా శుక్రవారం సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్‌తో పాటు ఎండీ పిల్లి రవి ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదినాన పరమ శివుని కరుణా కటాక్షం ప్రతి ఒక్కరికి ఉండాలని, పాడి పంటలు కలిగి ప్రజల సుఖశాంతులతో విరిజిల్లాలన్నారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి గట్టుమల్లన్నను దర్శించుకుని శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిగ్యూటీవ్ డైరెక్టర్లు కిషన్, సంతోష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

భక్తులు జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-జైపూర్

వేలాల మల్లన్న జాతరలో పాల్గొంటున్న భక్తులందరూ జాగ్రత్తలు పాటించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం రాత్రి వేలాల జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఆయన అడవీ ప్రాంతంలో భక్తులు జాగ్రత్తగా ఉండాలని దీపాలతో ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. జాతరకు తరలివచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. వాహనాల రాకపోకలు భక్తుల రద్దీ దృష్టితో పార్కింగ్ ఏరియాతో పాటు బారికేట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా గుట్టపై వెలసిన గట్టు మల్లన్నతో పాటు వేలాలలో కొలువై ఉన్న మల్లికార్జున స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్, జైపూర్ ఎస్సై ఉపేందర్ ఉన్నారు.



రేపు ఏబీఏపీ కన్‌క్లేవ్ సదస్సు

నవతెలంగాణ-నస్పూర్

మార్చి 10న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కార్తికేయన్ హాస్పటల్ కాన్ఫరెన్స్ హాల్లో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ (ఏబీఏపీ) కన్‌క్లేవ్ సదస్సుతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొండు నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి మట్టపల్లి సంపత్ రావు, పీఆర్ఏ భాస్కరి రాజేశంలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్రావు ముఖ్య అతిధిగా హాజరవుతారని తెలిపారు. జిల్లా జనరల్ బాడీ సమావేశంలో మంచిర్యాల జిల్లా ఏబీఏపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఏబీఏపీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జిలుగా తమిళనాడు రాష్ట్ర పీఆర్ఓ కే.కనకరాజు, రాష్ట్ర పీఆర్ఏ దుర్‌శెట్టి భాస్కర్ రానున్నారని, ఏబీఏపీ జిల్లాలో అయ్యప్ప స్వామి ధర్మ ప్రచారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి భక్తులు, జిల్లాలోని బ్రాంచుల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో శివరాత్రి పండగ వేడుకలు

నవతెలంగాణ-దండేపల్లి

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ద్వారక, లక్ష్మీకాంతపూర్, గూడెం గోదావరి నది తీరాల వద్ద శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున స్నానాలు ఆచరించారు. గూడెం గోదావరి వద్ద సరిహద్దు జిల్లాలోని భక్తులు పెద్ద ఎత్తున పుణ్య స్నానాలు ఆచరించి గూడెం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. భక్తుల తాకిడితో గోదావరి నది తీరం జనసంద్రంగా మారింది. దండేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో గోదావరి నది వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. నీరు ఎక్కువగా ఉండడంతో నది తీరంలో లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.



బైక్‌కు హెల్మెట్ అనుసంధానం అభినందనీయం

నవతెలంగాణ-నస్పూర్



స్మార్ట్ ఫార్ములాతో ద్విచక్ర వాహనాన్ని హెల్మెట్‌ను అనుసంధానించడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని "స్మార్ట్ హెల్మెట్" ని తయారు చేసిన మంచిర్యాల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి వెన్నంపల్లి సిద్ధాంత్ సాయిని కలెక్టర్ అభినందించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం ద్వారా ప్రమాదాలు జరిగినప్పుడు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు హెల్మెట్ లేనిదే వాహనం స్టార్ట్ కాకుండా ద్విచక్ర వాహన చోదకులను ప్రమాదాల బారి నుండి కాపాడాలనే ఉద్దేశంతో స్మార్ట్ హెల్మెట్‌ను తయారు చేశాడని తెలిపారు. స్మార్ట్ హెల్మెట్ తలకు ధరించకపోతే ద్విచక్రవాహనం స్టార్ట్ కాకుండా వాహనానికి హెల్మెట్ సెన్సార్‌ని అనుసంధానం చేశానని విద్యార్థి సిద్ధాంత సాయి వివరించాడు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి నష్టపోవడమే కాకుండా అతని మీద ఆధారపడిన కుటుంబ సభ్యులు కూడా ఎంతో నష్టపోతున్నారని, ఈ నేపథ్యంలో స్మార్ట్ హెల్మెట్ ఒక మంచి ఆలోచనని అన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వెలగనూరు గ్రామానికి చెందిన గడికప్పుల మహేందర్(27) అనే యువకుడు అత్తింటి వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఇన్‌చార్జి ఎస్ఐ పాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మహేందర్‌కు నస్పూర్ గ్రామానికి చెందిన ఓ యువతితో పెళ్లి జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. గతేడాది నుండి ఇద్దరికి మనస్పర్ధలు రావడంతో గొడవలకు దారి తీసింది. దీంతో మహేందర్ అతని కుటుంబ సభ్యులపై దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో వేధిస్తున్నారని కేసు నమోదైయింది. మహేందర్‌పై ఆ యువతి కుటుంబ సభ్యులు వేధింపులకు దిగారు. గురువారం సాయంత్రం తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఏడుస్తూ ఇంటికి వచ్చాడు. తనకు బ్రతకాలని ఉందని తనను బతికించాలని కుటుంబ సభ్యులకు చెప్పడంతో లక్షెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుని తండ్రి గడికోప్పుల లచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ పాల్ తెలిపారు.

మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలు సరికావు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రైతు బంధు డబ్బులు ఆపి ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు చెల్లిస్తారా అంటూ మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను పీఆర్టీయూ తెలంగాణ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తౌటం శ్యామ్ సుందర్, తిరుపతి ఖండించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడుతున్న ఉద్యోగులను అవమానించడమేనని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో ఉద్యోగ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం జీతాలు ఆలస్యంగా చెల్లించడం వల్ల బ్యాంకు లోన్లు సమయానికి కట్టలేక ఫైన్ చెల్లించామని దానిని ప్రస్తుత ప్రభుత్వం సరిచేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు ఇలా రైతులను ఉద్యోగులపైకి ఉసిగొల్పి ప్రయోజనం పొందాలను కోవడం సిగ్గు చేటున్నారు. ఇక నైనా ఇలాంటి మాటలు మానుకోని, తన వ్యాఖ్యలని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సేవాలాల్ దీక్ష స్వీకరణ ప్రారంభం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని కొత్తపల్లి-హెచ్ దీక్ష భూమిలో శుక్రవారం మహాశివ రాత్రి పర్వదిన సందర్భంగా సేవాలాల్ దీక్షను బంజారా లంబాడి భక్తులు గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. 41రోజులుగా సేవాలాల్ దీక్షను స్వీకరించారు. దీక్ష కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవాలాల్ దీక్షను తీసుకొని ఆధ్యాత్మిక భావంతో మెలగాలన్నారు. ముఖ్యంగా యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడిచి సంస్కారం, శ్రద్ధ, వినయం అలవర్చుకోవాలని కోరారు. అనంతరం దీక్షదారులకు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఇన్‌ఛార్జి చైర్మన్ ఆడే సురేష్, బంజారా యువసేన మండల అధ్యక్షుడు జాదవ్ దత్త, మాజీ సర్పంచులు రాథోడ్ శేషారావ్, సుభద్ర రామేశ్వర్, నాయకులు పవార్ దేవిదాస్, మాజీ ఎంపిటిసి రాథోడ్ రమేష్, దుపానాయక్, నరహరిదాస్, రాథోడ్ అనిల్ పాల్గొన్నారు.

శివాలయాల్లో భక్తుల రద్దీ

- శివనామ స్మరణలతో శివసత్తుల పూనకాలు
- భారీగా తరలివచ్చిన భక్త జనం

నవతెలంగాణ-జైపూర్

చెట్టు పుట్ట అనే తేడా లేకుండా పర్వత గిరిని చుట్టుముట్టిన వేలాల గట్టుమల్లన్న సన్నిధి శివనామ స్మరణలతో మార్మోగింది. పిలిచిన పలికే దేవునిగా ప్రసిద్ధిగాంచిన వేలాల గట్టుమల్లన్నను దర్శనకోసం శుక్రవారం ఉదయం నుండే భక్తులు పోటేత్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని వేలాల గట్టుమల్లన్నకు మొక్కులు చెల్లించుకోవడం సంప్రదాయంగా భక్తులు పాటిస్తారు. గత సంవత్సరంతోపోల్చితే ఈ ఏడాది భక్తుల రద్దీ పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. రాత్రి 12 గంటలకు గట్టుమల్లన్న సన్నిధిలో నిశీపూజ, అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో సామూహిక బిల్వదళ సమర్పణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈఓ రమేష్ తెలిపారు.

పశ్చిమ ముఖ:ద్వారంతో దర్శనమిస్తున్న గట్టు మల్లన్న

గుట్టల సమూహం మధ్య పశ్చిమ ముఖ:ద్వారం గుట్టదొనలో పిలిచిన పలికే దేవునిగా ప్రసిద్ధిగాంచిన గట్టుమల్లన్న భక్తులకు దర్శనమిస్తున్నాడు. గుట్టదొనలో స్వయంభూ: లింగాకారుడై వెల్సిన దర్శించుకుని మొక్కులు చెల్లిస్తే మదిలో తలచిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. వేలాల మల్లన్నను దర్శించుకోవడం కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. సమీపంలో గల గోదావరి నదిలో స్నానాలు ఆచరించి గుట్టపై వెల్సిన గట్టుమల్లన్న సన్నిధిలో జాగరణ చేస్తారు. అదే విధంగా కొత్తకుండల్లో బోనాలు పోసి పట్నాలు వేసి మొక్కులు చెల్లిస్తారు.

భక్తి శ్రద్దలతో భ్రమరాంభికా మల్లిఖార్జునస్వామి కళ్యాణోత్సవం

వేలాల గ్రామంలో కొలువైవున్న మల్లిఖార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రిని

పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా అత్యంత భక్తి శ్రద్ధలో భ్రమరాంభికా మల్లిఖార్జునస్వామి కళ్యాణోత్సవం జరిపించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దీనికి ముందు గోదావరి నదిలో స్వామి వారికి పుణ్యస్నానాలు చేయించి ఆలయానికి తరలించారు.

వేలాల గట్టుమల్లన్న సన్నిధిలో సకల సౌకర్యాలు కల్పిస్తాం..
- ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

భక్తుల సౌకర్యార్థం గట్టుమల్లన్న సన్నిధిలో సకల వసతులు కల్పిస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గట్టుమల్లన్నను కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పెగడపల్లి గ్రామంలోని రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. గట్టుమల్లన్న సన్నిధికి రోడ్డు నిర్మాణంతో పాటు నీటి వసతి కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జాతరకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం విశాఖ ట్రస్టు ద్వార సేవలు అందిస్తున్నామని, అవసరమైన ప్రదేశాల్లో ఇప్పటికే బోర్లు వేస్తున్నామన్నారు. భార్య సరోజన, కుమారుడు వంశీతో మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే వివేక్‌ను నాయకులు, ఆలయ కమిటి సభ్యులు శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఫయాజోద్దీన్, రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, చల్ల సత్యనారాయణ రెడ్డి, లింగారెడ్డి, చల్ల విశ్వంబర్ రెడ్డి, రిక్కుల లక్ష్మినారాయణ రెడ్డి, గుడెల్లి శ్రీనివాస్ రెడ్డి, మంతెన లక్ష్మన్, ప్యాగ శామల లక్ష్మన్, దేగ నగేష్ పాల్గొన్నారు.

జన్నారం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని శివ భక్తులు, ఉదయాన్నే గోదావరి పుణ్యస్నానాలు ఆచరించి శైవ క్షేత్రాలలో పూజలు చేశారు. మండలంలోని కలమడుగు, ధర్మారం, బాదంపెల్లి, చింతగూడ, రోటిగూడ, తపాలాపూర్, తిమ్మాపూర్, రాంపూర్, గ్రామ సమీపాన ఉన్న గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. తిమ్మాపూర్ గ్రామ సమీపాన ఉన్న గోదావరి నదిలో స్నానాలు చేయడానికి వచ్చిన శివ భక్తుల కోసం మాజీ సర్పంచ్ జాడి గంగాధర్ పండ్లను అందించారు. అలాగే ధర్మారం గ్రామంలో సన్‌రైజ్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారంతో పాటు పండ్లు అందించారు. శివరాత్రి సందర్భంగా శివ భక్తులు జాగారం చేస్తూ ఉపవాస దీక్షలు ఆచారించారు. తపాలపురం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో శివ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా గ్రామాల మాజీ సర్పంచ్లు, మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రెబ్బెన : మండలంలోని నంబాలలోని ప్రసన్న పరమేశ్వర ఆలయంలో భక్తులు పుణ్య స్థానాలు ఆచరించి శివునికి అభిషేకలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నంబలలోని ప్రసన్న పరమేశ్వర ఆలయం, గోలేటిలోని కోదండ రామాలయంలోని శివాలయంలో భక్తులు అభిషేకాలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. శివరాత్రి అభిషేకాలు, జాగారం చేసి ఉపవాసలతో జాగారం చేసి స్వామివారికి పూజలు చేస్తే కోరికలు తీరుతాయని భక్తులకు నమ్మకం. అలాగే దుగ్గపూర్‌లోని శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణ అనంతరం సాయంత్రం స్వామివారి రథోత్సవం కనుల పండుగగా నిర్వహించారు.



గట్టుమల్లన్నను దర్శించుకున్న వివేక్ కుటుంబ సభ్యులు



గుట్టపైన క్యూకట్టిన భక్తులు



ఎర్రటి ఎండలో వసతి ఏర్పాటు చేసుకుంటున్న భక్తులు

బీఎస్పీ పొత్తును వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్‌కు రాజీనామా



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్‌తో పొత్తును వ్యతిరేకిస్తున్నామని కాగజ్‌నగర్ మండల పరిషత్ అధ్యక్షుడు చీపురుశెట్టి శంకరయ్య తెలిపారు. శుక్రవారం ఎంపీపీతో పాటు కాగజ్‌నగర్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు స్వదేశ్ శర్మ, పీఏసీఎస్ చైర్మన్ ఉమామహేశ్వర రావు, 10 మంది డైరెక్టర్లు, మండల కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ ఖాన్, 24 మంది మాజీ సర్పంచ్లు, 11 మంది ఎంపీటీసీ సభ్యులు, పలువురు మండలస్థాయి నాయకులు మూకుమ్మడిగా బీఆర్ఎస్ పార్టీకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఓటమికి కారకుడైన బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ పొత్తును వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. తమ అధినేత కోనేరు కోనప్ప ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీలో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జి వాసుదేవ్, నికూరె నాగేందర్, ఖలీం, మౌల్కార్ లక్ష్మణ్, అరికిల్ల కుమార్, బొట్లకుంట మల్లేష్, నగునూరి శ్రీనివాస్, కల్లెపల్లి రాజన్న, బొమ్మెల కిషన్, పిర్సింగుల పోచయ్య, మెంత్యాల సత్యనారాయణ, శ్రీనివాస్ నాయక్, నగునూరి నీరజ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-రెబ్బెన

విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారి ఇమాన్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ మరమ్మత్తుల కారణంగా నమ్మాల, రెబ్బెన సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మహార్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను సంఘం ఉపాధ్యక్షులు బద్రే సుభాష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాల వల్ల శారీరక దృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి జీవితంలో ఉన్నత శిఖారాలని అదిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మెన్ హడవ్ అశోక్ పాల్గొన్నారు.



హరీశ్‌రావు వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

నవతెలంగాణ-నిర్మల్

రైతుబంధు డబ్బులు ఆపి ఏసీ రూముల్లో కూర్చునే ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించిందంటూ, ఈనెల 7న మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికోసం నిరంతరం పాటు పడుతున్న ఉద్యోగులను ఇది అవమానించడమేనని వారు పేర్కొన్నారు. రైతుబంధుకు తాము వ్యతిరేకం కాదని, కానీ రైతులకు, ఉద్యోగుల వేతనాలకు సంబంధం ఏంటని వారు ప్రశ్నించారు. గతంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల వేతనాలపై దుష్ప్రచారం చేసి ప్రజల్లో ఉద్యోగుల పట్ల వ్యతిరేకత తీసుకొచ్చే ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు కూడా అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించటంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర కీలకమనీ, మొత్తం ఉద్యోగులలో కొద్ది మంది మాత్రమే ఏసీ రూముల్లో కూర్చొని పని చేస్తారని తెలియజేశారు. మెజారిటీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో, ఆఫీస్‌లలో, పాఠశాలల్లో కనీస వసతులు లేని పరిస్థితుల్లో, పనిచేసే విషయాన్ని మాజీ మంత్రి గుర్తించాలని తెలిపారు. గత ప్రభుత్వం జీతాలు ఆలస్యంగా చెల్లించటం మూలంగా బ్యాంక్ లోన్లు సమయానికి కట్టలేక ఫైన్ చెల్లించామని, ప్రస్తుత ప్రభుత్వం దానిని సరిచేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు ఇలా ప్రజలను ఉద్యోగుల పైకి ఉసిగొల్పి ప్రయోజనం పొందాలనుకోవటం బాధాకరమని వాపోయారు. ఇకనైనా ఇలాంటి మాటలు మానుకోవాలని హితవు పలికారు.

ఆదిలాబాద్‌టౌన్ : రైతుబంధు డబ్బులు ఆపి, ఏసీ రూములో కూర్చునే ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించిందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ అన్నారు. వెంటనే ఉద్యోగులందరికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు మాత్రమే ఆపకుండా, నెలనెలా ఉద్యోగులు దాచుకున్న తమ జీపీఎఫ్ (జీపీఎఫ్) సొమ్మును కూడా సకాలంలో అందకుండా తీవ్ర మానసిక వేదనకు గురి చేశారన్నారు. తమ రాజకీయ లబ్ది కొరకు ఉద్యోగ ఉపాధ్యాయ వేతనాలు ఆపి, పథకాలకు నిధులు మళ్లించిన మీకు, వేతన జీవుల కష్టాలు ఏలా అర్ధమవుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలను, ఆశయాలను సమర్ధవంతంగా ప్రజలకు అందించడంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ముఖ్య పాత్ర పోషిస్తున్నప్పటికీ ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూడటాన్ని తపస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుందని అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ, జిల్లా నాయకులు గంగయ్య, మెస్రం రాజ్‌కుమార్, అశ్విన్, సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.

పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో...

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్రపోశించిన ఉద్యోగులను కించ పరిచే విధంగా మాజీ మంత్రి హరీశ్‌రావ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం మనుకోవాలని పీఆర్టీయూటీఎస్ వ్యవస్థపక రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రహదారిపై హరీశ్‌రావ్ ఫ్లెక్సీని, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో కలిసి దహనం చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల వల్లనే అధికారంలోకి వచ్చిన హరీశ్‌రావ్ వారిని చులకనగా చేసి మాట్లాడటం సరికాదన్నారు. ఉద్యోగులు, రైతులను పట్టించుకోని కారణంగా నేడు అధికారం కోల్పోయారన్నారు. బీఆర్ఎస్ హాయంలో 15వ తేది వరకు వేతనాలు వచ్చేవి కావని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతి నెల 1న వేతనాలు అందిస్తుందన్నారని అన్నారు. దీన్ని ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులు, రైతులను మోసం చేసిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హాయంలో రైతులు, ఉపాధ్యాయులకు సమన్యాయం చేస్తున్నామన్నారు. రైతుబంధు డబ్బులు వేశామని, త్వరలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు.



ఆదిలాబాద్‌టౌన్: మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షులు



ఆదిలాబాద్‌టౌన్: హరీష్‌రావు ఫ్లెక్సీని దహనం చేస్తున్న పీఆర్టీయూటీఎస్ నాయకులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-బెజ్జూరు

మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కరుణ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లను శాలువాలతో సత్కరించి మెమోంటోలు అందజేశారు. మహిళలకు ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బూస శంకర్, నాయకులు విష్ణు, విష్ణుమూర్తి, బాబాజీ పాల్గొన్నారు.

వాంకిడి : మహిళా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నులే నారాయణ పాల్గొని ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకుసాగాలన్నారు. మహిళలకు ప్రత్యేకంగా గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తులసీబాయి, కాంగ్రెస్ నాయకులు అరుణకు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అనిల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, బీసీసెల్ మండల అధ్యక్షుడు మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.



బెజ్జూరు

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవి ప్రసాద్ హాజరైన మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో పోటీపడుతూ ఎదగడం ఎంతో సంతోషం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రి ఏసీఎంఓ ఉషారాణి సేవ సమితి ఉపాధ్యక్షురాలు నళిని నరేందర్‌తో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సింగరేణి పాఠశాల విద్యార్థులు నృత్యాలు మహిళల పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. మూడు రోజులుగా మాదారం ఆఫీసర్ క్లబ్ మరియు సీఈఆర్ క్లబ్‌లలో నిర్వహించిన ఆటల పోటీలలో క్రీడా పోటీలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం నరేందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, డీజీఎం సివిల్ సతీష్ బాబు, పర్సనల్ మేనేజర్ రెడ్డి వల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.



వాంకిడి



రెబ్బెన